మడికొండ: మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

హనుమకొండ, మే 27: జిల్లాలోని గౌరవెల్లి ప్రాజెక్ట్, గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే కోసం భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ పీ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియపై హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేశ్, పరకాల నియోజకవర్గ పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణ పురోగతిపై పరకాల ఆర్డీవో నారాయణ వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణ మొదటి దశలో గుర్తించిన రైతులకు జూన్ 30నాటికి పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ డీఈ చైతన్య, ఆర్ అండ్ బీ ఈఈ సురేష్‌బాబు, నేషనల్ హైవే అధికారులు, తహసీల్దార్లు విజయలక్ష్మి, జ్యోతివరలక్ష్మి దేవి, జగన్‌మోహన్‌రెడ్డి, బావ్ సింగ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సర్వే అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి

మడికొండ: సర్వే అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని సాంకేతిక శిక్షణాభివృద్ధి కేంద్రం (టీటీడీసీ)లో జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో లైసెన్స్ సర్వేయర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి బోధనా అంశాలు విన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ లైసెన్స్ సర్వేయర్లకు 50రోజుల శిక్షణ కాలంలో అన్ని అంశాలపై పట్టుసాధించేలా శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. శిక్షణ తర్వాత అభ్యర్థులకు పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. శిక్షణ మెటీరియల్‌ను కలెక్టర్ చేతులమీదుగా అభ్యర్థులకు పంపిణీ చేశారు. ల్యాండ్ సర్వే రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో వరంగల్‌లో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్

హనుమకొండ, మే 27: వరంగల్‌లో త్వరలో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఎంపీ కడియం కావ్య కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు విజ్ఞప్తి చేశారు. గత పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. వరంగల్‌తోపాటు దేశవ్యాప్తంగా 22 కొత్త సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభించేందుకు ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపినట్లు అదనపు కార్యదర్శి ఎంపీకి లేఖ రాశారు. ఈ సెంటర్ల పనితీరు ప్రారంభించేందుకు అవసరమైన పోస్టుల సృష్టికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీఓపీటీ) నుంచి ఆమోదం లభించిందని అందులో పేర్కొన్నారు. ఆర్థిక అనుమతి కోసం ఆర్థిక మంత్రిత్వ శాఖలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండిచర్ (డీఓఈ)కు పంపగా కొన్ని వివరణలు కోరుతూ ఫైల్ పంపారని అదనపు కార్యదర్శి ఎంపీకి వివరించారు. వరంగల్‌లో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, ఉద్యోగ కుటుంబాలకు వైద్యచికిత్సలు, వ్యాధి నిర్ధారణ, తదితర సౌకర్యాలు రానున్నాయి.

నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు

మంద కృష్ణ మాదిగకు ఘనస్వాగతం పలకాలి

కాజీపేట/ ధర్మసాగర్, మే 27: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పద్మశ్రీ అవార్డు అందుకున్న తర్వాత ఈనెల 31న రానున్నందున వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఘనంగా స్వాగతం పలికేందుకు ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేశ్ మాదిగ పిలుపునిచ్చారు. కాజీపేట, ధర్మసాగర్‌లలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాలు మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగకు స్వాగతం పలికి, హనుకొండ కాళోజీ కళాక్షేత్రం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కళాక్షేత్రంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జాతీయ కార్యవర్గ సదస్సు ఉంటుందని పేరొన్నారు. ఎమ్మెస్పీ జిల్లా కార్యదర్శి తిప్పారపు మల్లేశం మాదిగ, ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు మంద రాజు మాదిగ, జన్పు దినేష్ మాదిగ, బండారి సురేందర్ మాదిగ, గద్దల సుకుమార్ మాదిగ, అక్కలకుంట వెంకటస్వామి మాదిగ, జేరిపోతుల సారంగపాణి మాదిగ, భిక్షపతి మాదిగ, ఇనగాల రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శాంతిసాగర్, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్, జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్, పుట్ట ప్రశాంత్, బాబు, రాజు పాల్గొన్నారు.

దంచి కొట్టిన వాన

- సాయంత్రం వేళ ఆగమాగం
- నగర రహదారుల్లో వరద ప్రవాహం
- లోతట్టు కాలనీలు జలమయం
- స్తంభించిన జనజీవనం

వరంగల్, మే 27 : నగరంలో వాన దంచికొట్టింది. జోరుగా కురిసిన వర్షంతో జనజీవనం అతలాకుతలమైంది. ప్రధాన రహదారులపై వాననీళ్లు ప్రవహించి లోతట్టు కాలనీల్లోకి చేరాయి. మంగళవారం సాయంత్రం కురవగా ఆఫీసుల నుంచి ఇంటికి బయల్దేరిన ఉద్యోగులు, రోడ్డు పక్క చిరు వ్యాపారస్తులు తీవ్ర అవస్థలు పడ్డారు. వరంగల్ సీకేఎం ఆస్పత్రికి వెళ్లే రహదారిపై మోకాళ్ల లోతు వరద చేరింది. వరంగల్ అండర్‌బ్రిడ్జి, చిన్న బ్రిడ్జిల కింద వర్షం నీరు భారీగా చేరింది. దీంతో వాహనదారులు బ్రిడ్జిలు దాటడానికి ఇబ్బందులు పడ్డారు. హనుమకొండలోని బస్ స్టేషన్, కాకాజీకాలనీ ప్రాంతాలు జలమయం అయ్యాయి. అర్ధరాత్రి వరకు వర్షం కురుస్తూనే ఉంది.

లోతట్టు ప్రాంతాలకు వర్షం నీరు

నగరంలో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని పలు కాలనీలకు వరద నీరు చేరింది. చిన్నపాటి వర్షానికే కాలనీలకు వరద రావడంతో కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. లక్ష్మీనగర్, సాకరాశికుంట, కాశికుంట, హంటర్‌రోడ్డులోని పలు కాలనీల్లోకి వర్షం నీరు చేరింది. నగర ప్రధాన రహదారులపై వరద నీరు పెద్ద ఎత్తున ప్రవహించింది. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. వరంగల్ చౌరస్తా, మేదరివాడ, హెడ్ పోస్టాఫీస్ రోడ్లు వరదతో నిండిపోయాయి.

హనుమకొండ విజయ టాకీస్ రోడ్డులో వరద

మోకాళ్ల లోతు నీటిలో గర్భిణుల ఇబ్బందులు

వరంగల్ సీకేఎం ఆస్పత్రికి వెళ్లే రహదారి వర్షం నీటితో నిండింది. ఆస్పత్రి నుంచి వెళ్తున్న గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మోకాళ్ల లోతు వరద నీటిలో అతి కష్టం మీద నడుచుకుంటూ వెళ్లారు. చిన్న వర్షానికే నగరంలోని ప్రధాన రహదారుల పరిస్థితిని చూసి ప్రజలు ఆశ్చర్యపోయారు. రాబోయే వానకాలంలో ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. బల్దియా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని నగర వాసులు కోరుతున్నారు.

శాయంపేటలో భారీ వర్షం

శాయంపేట: మండలంలో భారీ వర్షం కురిసింది. మంగళవారం ఉదయం ఎండతో ఉబ్బరింత పెరిగి జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సాయంత్రం మబ్బులు పట్టి వాన దంచికొట్టింది. 5గంటలకు మొదలై భారీగా కురిసింది. దీంతో రోడ్లన్ని జలమయం అయ్యాయి. జనజీవనం స్తంభించింది. మండల పరిధిలో ఇంకా కొన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాలేదు. భారీ వర్షాలతో రైతులు టార్పాలిన్లు కప్పి తడవకుండా సంరక్షించుకుంటున్నారు.

హనుమకొండ బాలసముద్రంలో నిలిచిన మురుగునీరు

వరంగల్ అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని లక్ష్మీనగర్‌లో నిలిచిన వర్షం నీరు

వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రి రహదారిలో మోకాళ్ల లోతు వాన నీటిలో వెళ్తున్న ప్రజలు

అక్రమ అరెస్ట్‌లను నిలిపివేయాలి

ఆత్మకూరు, మే 27: అక్రమ అరెస్ట్‌లు నిలిపివేయాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సావురే కమల రాజేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజాపాలన భవనం ముట్టడికి తరలిరావాలని రాష్ట్ర మాజీ సర్పంచ్‌ల ఫోరం పిలుపునిచ్చింది. ఈమేరకు మంగళవారం మండలంలోని సర్పంచ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ నిధులు విడుదల చేసి, మాజీ సర్పంచ్‌లను మోసం చేస్తోందని, వెంటనే ఎస్ఎఫ్‌టీసీ నిధులు విడుదల చేసి ఆదుకోవాలన్నారు. మాజీ సర్పంచ్‌ల పాతబిల్లులను వెంటనే విడుదల చేయాలని, లేకపోతే ప్రభుత్వంపై ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మాజీ సర్పంచ్‌లు అర్షం బలరామ్, రాజేశ్వరీరాజు ఉన్నారు.

మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు

విత్తన, ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు

హసన్‌పర్తి, మే 27: మండలంలోని లక్ష్మి ఫెర్టిలైజర్, ఆగ్రోస్ రైతు సేవ కేంద్రంలో కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపులోని కాటన్‌సీడ్, వరి విత్తనాలు, ఫెర్టిలైజర్ గోదాములు, స్టాక్ రిజిస్టర్లు, స్టాక్ బోర్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పత్తి విత్తనాలు కొరత లేకుండా చూడాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్‌సింగ్, ఏడీఏ రాజ్‌కుమార్, టెక్నికల్ ఏవో కమలాకర్, ఏవో అనురాధ ఉన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

హసన్‌పర్తి, మే 27: హనుమకొండ గాయత్రి బ్యాంకు ఖాతాదారు పసరగొండకు చెందిన గజ్జి బొబ్బిలి ఇటీవల మరణించడంతో బ్యాంకు మేనేజర్ సందీప్‌కుమార్ నామినీ, మృతుడి భార్య మాలతకు ఎస్‌వీఎస్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు చేతులమీదుగా ప్రమాద బీమా చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు అలేఖ్య, రంజిత్, ప్రశాంత్ పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న తిరుమల్‌రావు

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు, మే 27: నిరుద్యోగ యువతీ యువకులు ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వరంగల్ పోచమ్మమైదాన్‌లో దీన్ దయాల్ కౌశల్య యోజన కేంద్రంలో శిక్షణ పొందేందుకు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఉచిత భోజనం, శిక్షణ, వసతి, యూనిఫామ్, బుక్స్, రూ.3వేల స్కాలర్‌షిప్, శిక్షణ తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సర్టిఫికెట్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. బుధవారం వరంగల్‌లోని శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. డీడీయూ – జీకేవై, ఈజీఎంఎం టెక్నాలజీస్ ఇన్‌చార్జి బీ రాజేందర్ పాల్గొన్నారు.

రేపు దామెరలో ఉపాధి మేళా

దామెర: మండల కేంద్రంలో ఈనెల 29వ తేదీన ఉచిత శిక్షణ, ఉపాధిమేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కల్పన మంగళవారం తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ, దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం, రాష్ట్ర ప్రభుత్వ ఈజీఎంఎం శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీటెక్నాలజీస్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు కంప్యూటర్ కోర్సు, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంటర్నెట్ కాన్సెప్ట్, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, వేర్‌హౌజ్ అసోసియేట్ తదితర రంగాల్లో శిక్షణ ఇస్తారని తెలిపారు. ఐదు నెలల శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తారని, ఈజీఎంఎం, ఎన్ఎస్‌డీ సర్టిఫికెట్స్ అందజేసి ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు ఎంపీడీవో వివరించారు.

6.85కిలోల ఎండు గంజాయి పట్టివేత

ఒకరు రిమాండ్.. మరొకరు పరార్

శాయంపేట, మే 27: పోలీసులు ఎండు గంజాయి 6.85కిలోలు పట్టుకున్న ఘటన మండలంలోని మాందారిపేట వద్ద మంగళవారం జరిగింది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌రావు స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఎస్సై జక్కుల పరమేశ్ సిబ్బందితో కలిసి మాందారిపేట స్టేజీ వద్ద వాహన తనిఖీలు చేస్తున్నారు. బస్టాండ్ వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించగా వెళ్లి విచారించి, బ్యాగ్ తనిఖీ చేశారు. అందులో 6.85 కిలోల ఎండు గంజాయి లభించగా స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.3.10లక్షలు ఉంటుందని వెల్లడించారు. మహారాష్ట్ర చంద్రాపూర్‌కు దత్‌టంపుల్‌కు చెందిన సయ్యద్ షారుఖ్ జాకీరుద్దిన్ అహ్మద్‌గా గుర్తించినట్లు తెలిపారు. అతడు ఒడిషాకు చెందిన జితేంద్రకుమార్ వద్ద గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముకునేవాడని చెప్పారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. మరో నిందితుడు జితేంద్రకుమార్ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

గంజాయిని తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్ చూపుతున్న సీఐ రంజిత్‌రావు

భద్రకాళీ వీరభద్ర సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం

హనుమకొండ, మే 27: భద్రకాళీ వీరభద్ర సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ బాలసముద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాల రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు బీరం నారాయణరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆకలితో ఉన్న బాటసారులకు భోజనం అందించడం మానవతా విలువలకు నిదర్శనమన్నారు. ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్‌తోపాటు కొందరు పాత్రికేయులు అన్నదానంలో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. సమితి వ్యవస్థాపకుడు పిన్నా శివకుమార్, నిర్వాహకులు నల్లా దిలీప్, వల్లాల వెంకటరమణ, కేంద్ర ప్రభుత్వ సమాచారశాఖ ఉమ్మడి జిల్లా అధికారి ఎస్ శ్రీధర్, చొల్లేటి శ్రీధర్, ఉప్పుల అనిల్ కుమార్, గౌరిశెట్టి ధనుంజయ, ఉల్లెంగుల మహేశ్, పీ విష్ణువర్ధన్, రామ్మోహన్, పాములపర్తి కేశవ్‌కుమార్, రాంరాజ్, వలిశెట్టి సుధాకర్ పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న సేవా సమితి సభ్యులు

ప్రమాదకర రోడ్డు మరమ్మతు

'నమస్తే' ఎఫెక్ట్

శాయంపేట, మే 27: మండలంలోని మైలారం నుంచి జోగంపల్లికి వెళ్లే దారిలో కల్వర్టు పక్కన గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారగా మరమ్మతు చేపట్టారు. 'ప్రమాదకరంగా రోడ్డు.. పట్టించుకోని అధికారులు' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు కంకర పోయించి మరమ్మతు చేపట్టారు. వాహనాలు దిగబడకుండా కంకరతో సరిచేశారు. వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గుంతపడిన చోట పోసిన కంకర

పీహెచ్‌సీకి వైద్య సిబ్బందిని నియమించాలి

దామెర, మే 27: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సిబ్బందిని వెంటనే నియమించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి మంగళవారం డీఎంహెచ్‌వో అప్పయ్యకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది కొరత వల్ల ప్రజలకు తగిన వైద్యసేవలు అందడంలేదని తెలిపారు. పీహెచ్‌సీలో పనిచేసే వైద్య సిబ్బంది డిప్యూటేషన్‌పై వెళ్లారని, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు వెంటనే స్పందించి సిబ్బందిని నియమించాలని కోరారు. మాజీ సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు వేల్పుల రాజుకుమార్, బత్తుల సుమంత్ పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణ వేడుకలను విజయవంతం చేయాలి

హనుమకొండ, మే 27: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను విజయవంతం చేయాలని ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్ వైవీ గణేశ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 2న ఈ వేడుకల నిర్వహణకు అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్ మేన శ్రీను, జడ్పీ సీఈవో విద్యాలత, ముఖ్య ప్రణాళిక అధికారి సత్యనారాయణరెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేశ్, డాక్టర్ కె.నారాయణ పాల్గొన్నారు.

జడ్పీ సీఈవో ఆకస్మిక పర్యటన

భీమదేవరపల్లి, మే 27: హనుమకొండ జడ్పీ సీఈవో విద్యాలత మండలంలో మంగళవారం ఆకస్మికంగా పర్యటించారు. ముల్కనూరు, భీమదేవరపల్లి గ్రామాల్లోని నర్సరీలను తనిఖీ చేశారు. కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. గ్రామాల్లోని వీధుల్లో డ్రెయినేజీల పరిశుభ్రత కోసం ఇంకుడు గుంతలను తప్పక ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఎంపీడీవో వీరేశం, ఎంపీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు జంగం పూర్ణచందర్, సురేందర్, టెక్నికల్ అసిస్టెంట్లు రవి, లావణ్య, ఫీల్డ్ అసిస్టెంట్లు కృష్ణ, శ్వేత పాల్గొన్నారు.

'నాగుర్ల' పరామర్శ

పరకాల/నడికూడ, మే 27: రైతు రుణ వియోచన కమిటీ రాష్ట్ర మాజీ చైర్మన్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ అండ్ డీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు అనారోగ్యంతో పరకాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యాపారి మనోహర్‌ను మంగళవారం పరామర్శించారు. పరకాల మండల ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గందే వెంకన్న పాల్గొన్నారు. నడికూడ మండలం నర్సక్కపల్లికి చెందిన ఆమదాపురం శంకర్‌రావు ఇటీవల అగ్ని ప్రమాదంలో మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని నాగూర్ల పరామర్శించారు.

మనోహర్‌ను పరామర్శిస్తున్న నాగుర్ల

మర్రి యాదవరెడ్డికి కార్పొరేటర్..

హనుమకొండ, మే 27: కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డిని 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ మంగళవారం పరామర్శించారు. యాదవరెడ్డి తల్లి మర్రి వెంకటమ్మ మృతిచెందిన విషయం తెలిసి, టీచర్స్‌కాలనీలో ఉంటున్న ఇంటికి వెళ్లి పరామర్శించి సానుభూతి తెలిపారు.

రూ.50వేల విరాళం అందజేత

శాయంపేట, మే 27: మండలంలోని సాధనపల్లిలో పెద్దమ్మతల్లి గుడి నిర్మాణానికి మాజీ వైస్ ఎంపీపీ, బీఆర్ఎస్ నేత వంగాల రమాదేవీ నారాయణరెడ్డి మంగళవారం రూ.50వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ పెద్దమ్మతల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలన్నారు. మాజీ ఎంపీటీసీ షేక్‌గౌస్, ముదిరాజ్ కుల సంఘం అధ్యక్షులు మిట్టపల్లి తిరుపతి, సాదు శ్రీను, మిట్టపల్లి సదానందం, మిట్టపల్లి శ్రీను, మాజీ సర్పంచ్ కత్తుల సాంబయ్య, బేర్గు రాకేశ్ పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న నారాయణరెడ్డి

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

పరకాల, మే 27: తెలంగాణ జర్నలిస్టుల ఫోరం (టీజేఎఫ్) రజతోత్సవ సభ విజయవంతం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (హెచ్-143) హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి మస్కపురి సుధాకర్, అర్షం రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈనెల 31వ తేదీన హైదరాబాద్ జలవిహార్‌లో నిర్వహించే టీజేఎఫ్ రజతోత్సవ సభ పోస్టర్‌ను మంగళవారం పట్టణంలోని అమరధామంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు నినాదంతో 2001 మే 31న తెలంగాణ జర్నలిస్టుల ఫోరం ఏర్పడిందని తెలిపారు. యూనియన్ నాయకుడు తుమ్మ శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు పీ వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ నాయకులు బొమ్మగాని ఆదర్శ్, దొమ్మటి శ్రీకాంత్, సూర్యప్రకాశ్, యూనియన్ పరకాల నాయకులు దాసరి రమేశ్, తిరుపతి, సుమంత్, ధనుంజయ పాల్గొన్నారు.

అమరధామం వద్ద పోస్టర్ ఆవిష్కరిస్తున్న జర్నలిస్టులు

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ధర్మసాగర్, మే 27: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం ఎంపీ కడియం కావ్య ధర్మసాగర్, వేలేరు మండలాలకు చెందిన 20మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. 32 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

డివిజన్లలో సమస్యలు పరిష్కరించాలి

హనుమకొండ, మే 27: నగరంలోని 30, 31 డివిజన్లలో సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కార్పొరేటర్లను కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా నాయకుడు మంద సంపత్ మాట్లాడుతూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటి సర్వేలో గుర్తించిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. సొంతింటి కల పేరుతో 31వ డివిజన్ న్యూశాయంపేట, 30వ డివిజన్ అంబేద్కర్‌నగర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించినప్పటికీ లబ్ధిదారులకు కేటాయించలేదన్నారు. ఎన్నికలముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదన్నారు. ఆలకుంట యాకయ్య, దూడపాక రాజేందర్, ఆలకుంట మల్లయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.

NT-325336

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

అర్హులను ఎంపిక చేయాలి

పరకాల, మే 28: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అర్హులను ఎంపిక చేయాలని మున్సిపల్ కమిషనర్ చెల్పూరి వెంకటేశ్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో భాగంగా మండల లెవల్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో ఇందిరమ్మ ఇండ్ల మొదటి విడత అర్హుల ఎంపికలో వార్డు ఆఫీసర్లు క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హులైన వారిని మాత్రమే ఎంపిక చేయాలని సూచించారు. ఎలాంటి అవకతవకలకు తావు లేదని చెప్పారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వినోద్ కుమార్, ఏఈ ఆకాంక్ష పాల్గొన్నారు.

నిషేధిత పొగాకు ఉత్పత్తులు పట్టివేత

భీమదేవరపల్లి, మే 27: మండలంలోని ముస్తఫాపూర్‌లో ఎలగందుల కృష్ణమూర్తి కిరాణం షాపులో మంగళవారం రూ.12,500 విలువైన నిషేధిత పొగాకు ఉత్పత్తులను పట్టుకున్నట్లు ముల్కనూరు ఎస్సై నంద్రు సా